సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 8 । ఆగస్టు । 2023



చేనేత జాతీయ దినోత్సవం
చేనేత జాతీయ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా పద్మశాలీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.
- 9లో



తెగిన గండి చెరువు కట్ట
యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని గండి చెరువులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రింగ్ కట్ట తెగిపోయింది.
- 9లో



కొనసాగుతున్న సమ్మె
సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు రాస్తారోకోలు నిర్వహించారు.
- 9లో

న్యూస్‌రీల్

ఇంజనీరింగ్ విద్యార్థులు జాయినింగ్ రిపోర్టు ఇవ్వాలి

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఫస్టియర్ ఇంజనీరింగ్ విద్యార్థులు జాయినింగ్ రిపోర్టును పానగల్ క్యాంపస్‌లో అందజేయాలని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రేఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9నుంచి విద్యార్థుల కుటుంబ సభ్యులు పానగల్ క్యాంపస్‌లో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు విజయ్‌కుమార్ సెల్ : 9490565566, శివ శంకర్ సెల్ : 9440167671 నంబర్లను సంప్రదించాలని కోరారు.

యాదాద్రి శివాలయంలో విశేష పూజలు



స్పటిక లింగానికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీస్వామి వారికి నిత్య కైంకర్యాలు నిర్వహించిన అనంతరం మండపంలో నిత్య రుద్ర హవనం, అభిషేకం, అర్చనలు గావించారు. గర్భాలయం, ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. శివపార్వతుల కల్యాణ వేడుక, సేవోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక యాదాద్రీశుడి ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు కొనసాగాయి.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

భువనగిరి : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ప్రతినిధులు మిరియాల దామోదర్, మెతుకు సైదులు డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నా పోస్టర్‌ను సోమవారం భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్ చేపట్టి ట్రెజరీ ఆమోదం పొంది పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలన్నారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సమాన వేతనం చెల్లించాలని కోరారు. ధర్నాకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎస్ భాస్కర్, మైలారం సత్తయ్య, ఎస్‌సతీష్, బాలయ్య, శ్రీధర్, సయ్యద్ అలీ పాల్గొన్నారు.

కొండపైకి ఆటోలను అనుమతించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట : అసెంబ్లీ ఎన్నికలకు ముందే యాదాద్రి కొండపైకి ఆటోలకు అనుమతి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదగిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఆటో కార్మికులు 500 రోజులుగా దీక్ష, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికలకు ముందే కొండపైకి ఆటోలను అనుమతించేలా స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, మండల కార్యదర్శి జానకిరాములు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, మండల కార్యదర్శి గోపగాని రాజు, గీత పనివారల సంఘం మండల కార్యదర్శి గుండు వెంకటేష్, చిన్నకందుకూర్ ఉపసర్పంచ్ కల్లెపల్లి మహేందర్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు పెంటయ్య పాల్గొన్నారు.



'అమ్మ'కు పరీక్ష

భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి సోమవారం చెకప్ కోసం వచ్చిన గర్భిణులు అవస్థలు పడ్డారు. గర్భిణులతో పాటు సీజనల్ వ్యాధుల బారిన పడ్డవారు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఒక్కటే కౌంటర్ ఉండడంతో గంటల తరబడి లైన్‌లో నిల్చోవలసి వచ్చింది. దీంతో గర్భిణులు ఇబ్బందులకు గురయ్యారు. గర్భిణులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి

గజం రెండున్నర లక్షలు!

భువనగిరిలో రికార్డు స్థాయిలో భూముల ధర

- వాణిజ్య స్థలాలకు విపరీతమైన డిమాండ్
- జాతీయ రహదారుల వెంట ఎకరం రూ.6 కోట్ల పైనే
- రీజినల్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లోనూ రియల్ జోరు



సాక్షి, యాదాద్రి : భూముల ధరలు దూసుకెళ్తున్నాయి. ప్రధానంగా పట్టణాలు, జాతీయ రహదారుల వెంట మూడు, నాలుగింతలు పెరిగాయి. కొన్నిచోట్ల గజం రూ.లక్షల్లో పలుకుతోంది. ఇటీవల భువనగిరిలో రూ. 2.50 లక్షలకు విక్రయించారు. జిల్లా చరిత్రలో ఇదే అత్యధిక ధర కావడం గమనార్హం. చౌటుప్పల్, ఆలేరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, మోత్కూరు, బీబీనగర్ పరిధిలోనూ తక్కువేమీ లేదు. వాణిజ్య స్థలాలకు డిమాండ్ విపరీతంగా ఉంది. జా తీయ రహదారుల వెంట సైతం రూ.6 కోట్లకు చేరింది.

పట్టణ ప్రాంతాల్లో ఇలా..

- చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారికి ఇరువైపులా, చౌటుప్పల్ – వలిగొండ రోడ్డులో ప్రభుత్వ ధర గజం రూ.11 వేలు ఉండగా ఇటీవల రూ.1.30 లక్షలకు అమ్ముడుపోయింది. అదే విధంగా చౌటుప్పల్ – వలిగొండ మార్గంలో షట్టర్ మడిగ గజం రూ.80 వేలకు విక్రయించారు.
- యాదగిరిగుట్ట నుంచి భువనగిరి రోడ్డులో సన్నిధి హోటల్ వరకు వాణిజ్య స్థలం రేట్ రూ.9.800 కాగా గజం రూ.45 వేలకు విక్రయించారు.
- భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మెయిన్‌రోడ్డులో అంబేడ్కర్ విగ్రహం నుంచి పెట్రోల్‌బంక్ వరకు గజరం స్థలం కార్డు రేటు రూ.4,100 ఉండగా ఇటీవల రూ.55 వేలకు అమ్ముడుపోయింది.
- మొత్కూరు మున్సిపాలిటీలో కమర్షియల్ స్థలం రాయగిరి – మోత్కూరు, మోత్కూరు– అమ్మనబోలు రోడ్ల ఫేస్ గజం ప్రభుత్వ ధర రూ.4100 కాగా ఇటీవల రూ.20 వేలు పలికింది.
- బీబీనగర్ మండలం కొండమడుగు మెట్టు, బీబీనగర్ పట్టణంలోని వాణిజ్య ప్రాంతాల్లో గజం రూ.40 వేలు పలుకుతోంది.
- వలిగొండలో ప్రధాన రహదారి వెంట గజం రూ.60 వేలకు విక్రయించారు.

భువనగిరి పట్టణంలో రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్ చౌరస్తా వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్నదంతా అత్యంత కమర్షియల్ స్థలం. రోడ్డు విస్తరణలో తొలగించిన భవనాల స్థలంలో కొత్తగా వాణిజ్య భవనాలు వెలుస్తున్నాయి. వీటి నిర్మాణానికి యజమానులు లక్షల రూపాయలు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ ధర గజం రూ.37,800 ఉంది. జిల్లాలో ఇదే అత్యధిక రేటు. కాగా 20 రోజుల క్రితం ఆంధ్రాబ్యాంకు ఎదురుగా గజం రికార్డు స్థాయిలో రూ.2.50 లక్షలకు అమ్ముడుపోయింది. ఈ స్థలాన్ని జ్యువెలరీ వ్యాపారి కొనుగోలు చేశాడు. జిల్లాలో ఇప్పటి వరకు ఇదే రికార్డు ధర. గతేడాది ఇదే ప్రాంతంలో రూ.1లక్ష పలకగా ఇప్పుడు అమాంతం పెరిగింది.

హైదరాబాద్ - వరంగల్ హైవే వెంట

హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారి వెంట భూములు రూ.కోట్లల్లో పలుకుతున్నాయి. వారం రోజుల క్రితం వంగపల్లి – రాయగిరి మధ్య ఎకరం రూ.4 కోట్లకు అమ్మారు. యాదగిరిగుట్ట మండలం బాహుపేట సమీపంలో రెండున్నర ఎకరాలు ఎకరం రూ.3.70 కోట్ల చొప్పున అమ్ముడుపోయింది. వలిగొండ మండలం అక్కంపల్లి – నాతాళ్లగూడెం మధ్య చిట్యాల– భువనగిరి రోడ్డులో ఎకరం రూ.1.25 కోట్లకు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇక భువనగిరి, బీబీనగర్ పరిధిలోనూ జాతీయ రహదారికి ఇరువైపులా రూ.6 కోట్ల నుంచి రూ.7కోట్ల వరకు విక్రయిస్తున్నారు.

హైదరాబాద్ - విజయవాడ రహదారిపై..

చౌటుప్పల్ మండలం, మున్సిపాలిటీ పరిధిలో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి వెంట ఇటీవల కాలంలో భూముల రేట్లు చుక్కలను తాకుతున్నాయి.గతంలో తూప్రాన్‌పేట, దండుమల్కాపురం, చౌటుప్పల్ పరిధిలో ఎకరం రూ.1.50 కోట్లకు అమ్ముడుపోగా ప్రస్తుతం రూ.4కోట్ల నుంచి రూ.6 కోట్లకు చేరింది. చౌటుప్పల్ పట్టణ పరిధిలో ఎకరం భూమి ఐదేళ్ల క్రితం అత్యధికంగా కోటి రూపాయలు పలకగా ప్రస్తుతం రూ.6 కోట్లకు పైనే పలుకుతోంది. జాతీయ రహదారి వెంట గ్రామాల పరిధిలోనూ రూ.3 కోట్లకు పైనే చెబుతున్నారు.

రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలోనూ పరుగులు

రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తున్న ప్రాంతాల్లోనూ భూముల ధరలు పరుగులు తీస్తున్నాయి. భువనగిరి, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, వలిగొండ, చౌటుప్పల్, బీబీనగర్, భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట మండలాల పరిధిలో ఇప్పటికే భూముల ధర కోట్లలో పలుకుతుండగా రీజినల్ రింగ్ రోడ్డు రాకతో రెండు, మూడింతలు పెరిగాయి. హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు రీజినల్ రింగ్ రోడ్డు వెంట పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేస్తున్నారు. వలిగొండ మండల పరిధిలో ఒకప్పుడు ఎకరం రూ.35 లక్షలు ఉన్న ధర ప్రస్తుతం రూ.75 లక్షలు, చౌటుప్పల్ మండలంలో రూ.50 లక్షల నుంచి రూ.కోటికి చేరింది. తుర్కపల్లి మండల పరిధిలోనూ ఎకరం రూ.65లక్షల నుంచి కోటి రూపాయలకు పెరిగింది. భువనగిరి మున్సిపాలిటీ పరిధి రాయగిరి వద్ద జంక్షన్ ఏర్పాటు కానుండడంతో రైతుల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. వాటిని లేఅవుట్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. లేఅవుట్ అనుమతి కోసం ఇప్పటికే కొందరు రియల్టర్లు హెచ్ఎండీఏకు దరఖాస్తు చేసుకున్నారు.

గడువులోపు లక్ష్యాలను పూర్తి చేస్తాం



సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

సాక్షి, యాదాద్రి : నిర్దేశిత గడువులోపు ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేస్తామని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హరితహారం, గృహలక్ష్మి, జీఓ 59, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, బీసీ, మైనార్టీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయం, గొర్రెల పంపిణీపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. హరితహారంలో 21.88 లక్షలు నాటాలన్నది లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు 16.50 లక్షల మొక్కలు నాటామని, వాటిలో 9లక్షల మొక్కలకు జియోట్యాగింగ్ పూర్తయినట్లు తెలిపారు. రెండో విడత 706 గొర్రెల యూనిట్లు పంపిణీ చేశామని చెప్పారు. గృహలక్ష్మి పథకం కింద తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో ఈనెల 10వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సీఎస్‌కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఆర్‌ఓ పద్మజారాణి, అధికారులు యాదయ్య, శ్యాంసుందర్, డాక్టర్ కృష్ణ, జయపాల్‌రెడ్డి, అన్నపూర్ణ, నవీన్‌కుమార్, అనురాధ, వెంకటేశ్వర్లు, శంకరయ్య, శ్రీనివాసరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ ఫైళ్లకు పరిష్కారం

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ధరణి ఫైళ్ల పరిష్కారం కలెక్టర్ దృష్టి సారించారు. సోమవారం రాత్రి వరకు పెండింగ్ ఫైళ్లను పరిష్కరించారు. అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూనే మరోవైపు ఫైళ్లను పరిష్కరించారు. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

సాక్షి, యాదాద్రి : నోటరీ డాక్యుమెంట్ ద్వారా కొనుగోలు చేసిన భూముల్లో నిర్మించుకున్న భవనాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వు నం 84 ప్రకారం రిజిస్ట్రేషన్ కాని నోటరీతో ఉన్న కట్టడాల యజమానులు మీసేవ కేంద్రాలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు భూమికి సంబంధించిన నోటరీ పత్రం, లింకు డాక్యుమెంట్, ఆస్తి, నల్లా పన్ను రశీదు, విద్యుత్ బిల్లులో ఏదైనా ఒకటి జతచేయాలన్నారు.125గజాల లోపు భూమిలో నిర్మించుకున్న భవనాలకు స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఉంటుందని, అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలు ఉంటే స్టాంప్ డ్యూటీ చెల్లించవలసి ఉంటుందన్నారు. ఈనెల 1నుంచి మూడు నెలల వరకు అవకాశం ఉంటుందన్నారు.

'రాక్ క్లైంబింగ్'తో భువనగిరికి గుర్తింపు



శేఖర్‌బాబును సన్మానిస్తున్న రాక్ క్లైంబింగ్ స్కూల్ సిబ్బంది, పర్వతారోహకులు

భువనగిరి : రాక్ క్లైంబింగ్ స్కూల్ ద్వారా భువనగిరికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని ప్రముఖ పర్వతారోహకుడు, టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డు గ్రహీత బచనేపల్లి శేఖర్‌బాబు అన్నారు. రాక్ క్లైంబింగ్ స్కూల్ పదో వార్షికోత్సవం సందర్భంగా స్థానిక ఖిలా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాక్ క్లైంబింగ్ స్కూల్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 25వేల మంది విద్యార్థులు, ఇతరులకు ఖిలాపై పర్వతారోహణ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వీరిలో 92 మంది ఎవరెస్టుతో పాటు ప్రపంచంలోని ఇతర ఎత్తయిన పర్వతాలను అధిరోహించారని పేర్కొన్నారు. వీరితో పాటు మరో 100 మంది పర్వతాలను అధిరోహించిన వారిలో ఉన్నారని చెప్పారు. పదేళ్లుగా అనుభవజ్ఞులతో శిక్షణఇస్తూ రాక్ క్లైంబింగ్ స్కూల్‌తో పాటు ఖిలా పేరు ప్రఖ్యాతలను చాటుతున్నట్లు వివరించారు. డీఆర్‌డీఓ నాగిరెడ్డి మాట్లాడుతూ భువనగిరి రాక్ క్లైంబింగ్ స్కూల్‌లో శిక్షణ పొందినవారిలో ఎంతోమంది పర్వతాలను అధిరోహించి భువనగిరి పేరును ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. రాక్ క్లైంబింగ్ స్కూల్ పేరును ట్రాన్సెండ్ అకాడమీ ఆఫ్ రాక్‌క్లైంబింగ్‌గా మార్చారు. అనంతరం శేఖర్‌బాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఐ సుధీర్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, బాలల సంక్షేమ సమితి చైర్మన్‌బండారు జయశ్రీ, వారసత్వ కమిటీ సభ్యులు దిడ్డి బాలాజీ, ఆవుల వినోద్ కుమార్, కోచ్ పరమేష్, ఎవరెస్టు పర్వతారోహకులు పూర్ణ, ఆనంద్, రాకేష్, అన్వితారెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణికి హాజరు తప్పనిసరి

- అత్యవసర పని ఉంటే అనుమతి తీసుకోవాలి
- అధికారులకు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశం
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు

భువనగిరిటౌన్ : ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, ఏదైనా అత్యవసర పని ఉంటే అనుమతి తీసుకోవాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, వీరారెడ్డితో కలిసి వినతులు స్వీకరించారు. ఇరిగేషన్ డీఈకి బదులుగా ఏడీఈ రావడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.మరోసారి పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులను తిప్పుకోకుండా అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలకు సబంధించి 25 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మజారాణి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రామ్మూర్తి, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు ఇలా..

- ఆలేరు నుంచి బహదూర్‌పేటను తొలగించాలని కోరుతూ గ్రామస్తులు పలువురు కలెక్టర్‌కు విన్నవించారు. ఇంటి, నల్లా పన్ను పెరిగిందే తప్ప.. అభివృద్ధి జరగడం లేదన్నారు.
- నా భర్త పేరున ఉన్న భూమిని తన పేరుపై చేయాలని భువనగిరి మండలంలోని హన్మాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు మన్యాల రాములమ్మ విన్నవించారు.
- రేషన్ షాపుల్లో బియ్యంతో పాటు గోధుమలు, చక్కెర కూడా పంపిణీ చేయాలని వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు షరీఫ్ విన్నవించారు.
- తన కూతురుకు మాటలు రావని, దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని భువనగిరికి చెందిన బొడిగ శ్రీకాంత్ అర్జీ అందజేశారు.
- వారసత్వంగా కావాలితం చేసుకుంటూ వస్తున్న తమకు వీఆర్ఏ ఉద్యోగం ఇవ్వాలని బస్వాపురం గ్రామానికి చెందిన ఏడు కుటుంబాలు కోరాయి.

మొదటి రోజు 22 మందికి టీకాలు

- ప్రారంభమైన 'మిషన్ ఇంద్రధనస్సు'
- లక్ష్యం 426 మంది చిన్నారులు
- 12 వరకు కొనసాగనున్న కార్యక్రమం



లింగోజిగూడెం పీహెచ్‌సీలో చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

భువనగిరి : జిల్లాలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. చిన్నారుల్లో రోగ నిరోధక వ్యవస్థ మెరుగుపర్చి వ్యాధులను నివారించడానికి రోగ నిరోధక టీకాలు ఇస్తున్నారు. కంఠసర్పి, హెపటైటిస్, న్యూమోనియా, ధనుర్వాతం, టీబీ, మెదడువాపు, పోలియో వంటి వ్యాధుల నిర్మూలనకు ప్రభుత్వం ప్రతి నెలా ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాలు వేస్తోంది. స్థానికంగా అందుబాటులో లేక, జ్వరం రావడం, ఇతర కారణాలతో టీకా తీసుకోకపోవడంతో వంద శాతం లక్ష్యం నెరవేరడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గత నెలలో ఇంటింటి సర్వే నిర్వహించి టీకాలు వేసుకోని వారిని గుర్తించారు.

12 వరకు టీకాల పంపిణీ

జిల్లాలో వివిధ కారణాలతో టీకాలు వేసుకోని వారు 426 మంది చిన్నారులు, 17మంది గర్భిణులు ఉన్నట్లు గురించారు. వీరికి మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా బీసీజీ, పెంటా–1,పెంటా–2, పెంటా–3, బీసీవీ, ఐపీవీ, రోటా, పోలియో, ఎంఆర్1, ఎంఆర్2 తదితర టీకాలు వేస్తున్నారు. 12వ తేదీ వరకు టీకాల పంపిణీ కొనసాగనుంది. కాగా తొలి రోజు 22 మంది చిన్నారులకు టీకాలు వేశారు.

యు–విన్ పోర్టల్‌లో వివరాలు నమోదు

ప్రభుత్వం వ్యాధి నిరోధక టీకాల పంపిణీని డిజిటలైజేషన్ చేసింది. ఇందుకోసం యూనివర్సల్ ఇమ్యునైజేషన్ కార్యక్రమం కింద యు–విన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌లో ఈ నెల 7నుంచి గర్భిణులు, శిశువుల వివరాలను నమోదు చేస్తున్నారు. టీకా తీసుకునే తేదీకి ముందు సంబంధికుల సెల్‌ఫోన్‌కు సమాచారం వస్తుంది. యు–విన్ పోర్టల్‌లో వివరాల నమోదుతో అప్పటి వరకు తీసుకున్న టీకాలు, ఆరోగ్య వివరాలు నిక్షిప్తమై ఉంటాయి. ఈ వివరాలు జాతీయ స్థాయిలో నమోదు కావడం వల్ల ఏ ప్రాంతంలో ఉంటే అక్కడ టీకా తీసుకునే అవకాశం ఉంటుంది.

నిర్లక్ష్యం చేయొద్దు

బీబీనగర్ : మండలంలోని కొండమడుగు పీహెచ్‌సీని సోమవారం డీఎంహెచ్‌ఓ సందర్శించారు. చిన్నారులకు రోగ నిరోధక టీకాలు వేస్తుండగా పరిశీలించారు. చిన్నారులకు టీకాల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకొని సంబంధికులకు సమాచారం ఇవ్వాలన్నారు.

మూడు దశల్లో టీకాలు

గుర్తించిన చిన్నారులు, గర్భిణులకు రోగ నిరోధక టీకాల పంపిణీ సోమవారం ప్రారంభించాం. మూడు దశల్లో టీకాల పంపిణీ కొనసాగుతుంది. మొదటి విడత ఈనెల 12వ తేదీ వరకు కొనసాగుతుంది. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం ద్వారా ఇచ్చే టీకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ ప్రక్రియ అక్టోబర్ వరకు ఉంటుంది.

-డాక్టర్ మల్లికార్జున్‌రావు, డీఎంహెచ్‌ఓ

అండర్‌పాస్ నిర్మాణానికి డీపీఆర్ పంపాలి



సింగన్నగూడెం చౌరస్తాను పరిశీలిస్తున్న గూడూరు నారాయణరెడ్డి

భువనగిరి : పట్టణంలోని బైపాస్ రోడ్డులో సింగన్నగూడెం చౌరస్తా వద్ద అండర్‌పాస్ నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి డీపీఆర్ పంపాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి కోరారు. సోమవారం ఆయన సింగన్నగూడెం చౌరస్తాను సందర్శించారు. భువనగిరిలోకి వచ్చే క్రమంలో చౌరస్తా వద్ద ఎంతో మంది ప్రమాదాల బారిన చనిపోయారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కేంద్రానికి డీపీఆర్ పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నల్లమాస సుమ వెంకటేశ్వరుల రత్నపురం బలరాం, బోర్ర రాకేష్, ఊదరీ సతీష్, జనగాం కవిత నర్సింహ్మాచారి, బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌హన్‌రెడ్డి, ఓబీసీ నాయకులు రత్నపురం శ్రీశైలం, ఉడుత భాస్కర్, పుల్ల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు స్పాట్ కౌన్సిలింగ్

రామగిరి(నల్లగొండ): మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకుల జూనియర్ కళాశాలల్లో వివిధ గ్రూపుల్లో మిగిలి ఉన్న సీట్లకు ఆగస్టు 9న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓ షకీనా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర కళాశాలలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, బాలికల జూనియర్ కళాశాలల్లో బైపీసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. నల్లగొండ రెడ్డి హాస్టల్‌లో జరిగే స్పాట్ కౌన్సిలింగ్‌కు అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఆయిల్‌పామ్‌తో ఆర్థికాభివృద్ధి

- ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి



మొక్కలు నాటే కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి

మోత్కూరు : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మోత్కూరు మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు కొండ సోమల్లు వ్యవసాయ క్షేత్రంలో సోమవారం ఆయిల్‌పామ్ మొక్కలు నాటి మాట్లాడారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటుకోవడానికి అనువైన సమయం ఇదేనని, రైతులు ముందుకు రావాలన్నారు. పంటను ఆయిల్ ఫెడ్ సంస్థనే కొనుగోలు చేస్తుందన్నారు. ఫ్యాక్టరీ దగ్గరకు పంటను తీసుకెళ్లడానికి రవాణా ఖర్చులు సైతం చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, అడ్డగూడూర్ మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు తీపిరెడ్డి మేఘారెడ్డి, ఆయిల్‌ఫెడ్ జిల్లా అధికారి ప్రవీణ్, హార్టికల్చర్ క్లస్టర్ ఆఫీసర్ నసీమ, ఏఈవో అశోక్‌కుమార్, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ అధికారి మమత, రైతులు లెంకల వేణు, పసునూరి రాంరెడ్డి పాల్గొన్నారు.

గిరిజన ఆణిముత్యం ఎస్‌ఐగా..


వంశీ

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని పడమటి తండాకు చెందిన ఇస్లావత్ దస్రూ–తారీ దంపతులకు చెందిన గిరిజన ఆణిముత్యం ఇస్లావత్ వంశీ ఎస్‌ఐ ఉద్యోగం సాధించాడు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తూ ఉంటారు.వ్యవసాయ కుటుంబం, మారుమూల తండాలో జన్మించి ఉద్యోగం సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుడి కుమారుడు ఎస్‌ఐగా..


పత్తిపాటి శ్రీనివాస్

మేళ్లచెరువు : మేళ్లచెరువు గ్రామానికి చెందిన పత్తిపాటి కాశయ్య, యలమందమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాస్ బీటెక్ పూర్తి చేశాడు. చిన్ననాటి నుంచి ఎస్‌ఐ కావాలని కోరిక బలంగా పెంచుకున్న శ్రీనివాస్ ఇటీవల జరిగిన ఎస్‌ఐ ఎంపిక పరీక్షలో విజయం సాధించాడు. కష్టపడి చదివి ఎస్‌ఐ ఉద్యోగం పొందిన శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

తాపీమేస్త్రీ కుమారుడు ఎస్‌ఐగా..


రెడపంగు అశోక్

మఠంపల్లి: మండలంలోని పెదవీడుకు చెందిన నిరుపేద తాపీమేస్త్రీ రెడపంగు చినలక్ష్మయ్య, మంగమ్మల కుమారుడు రెడపంగు అశోక్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. దీంతో గ్రామస్తులు అశోక్‌ను అభినందించారు. తమ కుమారుడు కష్టపడి చదివి ఉద్యోగం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఇద్దరికి ఎస్‌ఐ ఉద్యోగాలు


టి. మధుబాబు


గోగుల శిరీష

శాలిగౌరారం : రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన ఎస్ ఉద్యోగ నియామక ఫలితాలలో శాలిగౌరారం మండలంలో ఇద్దరికి ఎస్‌ఐ ఉద్యోగాలు వరించాయి. వారిలో ఇటుకులపాడు గ్రామానికిచెందిన తాటిపాముల మధుబాబు, ఊట్కూరు గ్రామానికి చెందిన గోగుల శిరిష ఉన్నా రు. వీరాంత సివిల్ విభాగంలో ఎస్‌ఐ ఉద్యోగాలు సాధించారు. ఎస్‌ఐ ఉద్యోగాలు సాధించిన వారిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో..


భూపాల్‌రెడ్డి

కట్టంగూర్ : కట్టంగూర్ మండలంలోని కల్మెర గ్రామానికి చెందిన పిన్నపురెడ్డి భూపాల్‌రెడ్డి ఆర్మీలో పనిచేస్తూ రెండు సంవత్సరాల క్రితం రిటైర్మెంట్ తీసుకున్నాడు. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో పరీక్ష రాసి సివిల్ ఎస్‌ఐ ఉద్యోగం సంపాదించాడు. తల్లిదండ్రులు రామకృష్ణారెడ్డివిమలమ్మలది రైతు కుటుంబం.

రైతు కుమారుడు ఎస్‌ఐగా..


చింతల నితిన్‌రెడ్డి

కట్టంగూర్ : కట్టంగూర్ గ్రామ పంచాయతీ పరిధి మీరసాహెబ్‌గూడేనికి చెందిన చింతల సైదిరెడ్డిశోభారాణిల ఏకైక కుమారుడు నితిన్‌రెడ్డి. తల్లి అంగన్‌వాడీ టీచర్ కాగా తండ్రి రైతు. బీటెక్ పూర్తి చేసిన వెంటనే ఎస్‌ఐ నోటిఫికేషన్ రావటంతో దరఖాస్తు చేసుకుని సన్నద్ధమై సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు.

దర్జీ కూతురు సివిల్ ఎస్‌ఐగా..


గట్టు శ్రుతి

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన గట్టు ఉపేందర్, హేమలత దర్జీ పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. అమ్మాయిలను దర్జీ పని చేస్తూ కష్ట పడి చదివించారు. వీరి కుమార్తె శ్రుతి బీటెక్ పూర్తి చేసింది. నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేసుకుని సన్నద్ధమై సివిల్ ఎస్‌ఐగా ఎంపికైంది.

పట్టుబట్టారు.. కొలువు కొట్టారు

- పోలీసు శాఖలో ఎస్‌ఐలుగా ఉద్యోగాలు సాధించిన ఉమ్మడి జిల్లా యువత

అందరివీ సాధారణ మధ్య తరగతి కుటుంబాలే.. చదువుకుంటున్న దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.. అందుకు తగిన కృషి చేశారు. వివిధ వృత్తులు.. ఉన్నత చదువులు చదువుతున్నా లక్ష్యాన్ని మరువలేదు. పట్టుబట్టి సాధన చేశారు. ఒక్కో దశ దాటుకుంటూ గమ్యాన్ని చేరుకున్నారు. ఆదివారం విడుదలైన ఎస్‌ఐ ఉద్యోగ ఫలితాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా యువత సత్తా చాటారు. వివిధ కేటగిరీల్లో ఉద్యోగాలు సాధించి విజేతలుగా నిలిచారు.

సోదరుల స్ఫూర్తితోనే..


కందుల వెంకటేష్

మునగాల : మునగాల మండలం తాడువాయి గ్రామానికి చెందిన కందుల వెంకన్న – వెంకట్రావమ్మ దంపతులది మధ్య తరగతి కుటుంబం. కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నర్సింహారావు, రామారావు, వెంకటేష్ కుమారులు. వీరు బీటెక్ పూర్తిచేశారు. మూడో కుమారుడు కందుల వెంకటేష్ బీటెక్ పూర్తిచేసి తొలి ప్రయత్నంలోనే ఏఆర్ ఏస్‌ఐగా ఎంపికయ్యాడు. ఇతని సోదరులు కానిస్టేబుళ్లసోదరులను స్ఫూర్తిగా తీసుకుని ఎస్‌ఐ కొలువు సాధించానని వెంకటేష్ పేర్కొన్నాడు.

కానిస్టేబుల్ నుంచి ఎస్‌ఐగా...


తూటుపల్లి అజయ్

గుర్రంపోడు: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం పిట్ట లగూడెం గ్రామానికి చెందిన తూటుపల్లి సత్తమ్మ, మల్ల య్య దంపతుల కుమారుడు తూటుపల్లి అజయ్ 2016లో పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్ పనిచేస్తూ రెండో ప్రయత్నంలో సివిల్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. అజయ్ పాలిటెక్నిక్ డిప్లమా చేశాడు. ఎస్‌ఐగా ఎంపికైన అజయ్‌ను పలువురు అభినందించారు.

కష్టానికి ఫలితం


సురేష్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జున సాగర్): తిరుమలగిరి మండలం బోయగూడెం గ్రామానికి చెందిన వర్కాల వెంకట్‌రెడ్డి, రేవ తి దంపతులకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు నరేష్‌రెడ్డి హాలియాలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. రెండో కుమారుడు సురేష్‌రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. 2018 సంవత్సరంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తూనే సివిల్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించాడు. సురేష్‌రెడ్డి ఎస్‌ఐగా ఎంపిక కావడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

రెండో ప్రయత్నంలో ఎస్‌ఐగా..


వీరమల్ల అఖిల్

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన వీరమల్ల చంద్రశేఖర్, కష్ణవేణిలకు కూతురు మౌనిక, కుమారుడు అఖిల్ ఉన్నారు. చంద్రశేఖర్ గరిడేపల్లిలో మండలం పెంచికల్‌దిన్నె పీహెచ్‌సీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తల్లి గృహిణి. అఖిల్ గతంలో ఎస్‌ఐ పరీక్ష రాసి ఒక మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయాడు. కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం భువనగిరి జిల్లాలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. కోచింగ్ తీసుకోకుండా స్వతహాగా కష్టపడి చదివి ఏఆర్ ఎస్‌ఐ కొలువు సాధించాడు.

పెదనాన్న కోరిక మేరకు..


సుబ్బరాంరెడ్డి

హుజూర్‌నగర్ : గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన పశ్య నిర్మల సత్యనారాయణ రెడ్డిల కుటుంబం కొన్నేళ్లుగా హుజూర్‌నగర్‌కు వచ్చి ఉంటోంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో చిన్న కుమారుడు మెఘనాథ్‌రెడ్డి ప్రస్తుతం ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. పెద్ద కుమారుడు సుబ్బరాంరెడి బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి పెద న్నాన పుల్లారెడ్డి కోరిక మేరకు ప్రభుత్వ ఉద్యోగాల వేటలో పడ్డాడు. చివరికి (ఫైర్) ఎస్‌ఐ ఉద్యోగం సాధించాడు. ఇంకా ఉన్నత ఉద్యోగం సాధిస్తానంటున్నాడు.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో..


కుసుమ ఉపేందర్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన కుసుమ పద్మ–శ్రీనివాస్‌రెడ్డిలది మధ్యతరగతి కుటుంబం. ఈ దంపతులకు ఇద్దరు సంతానంలో వీరిలో అమ్మాయి ఉమ పెద్దదిగా కాగా చిన్నవాడు ఉపేందర్‌రెడ్డి. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంసీఏ పూర్తి చేశాడు. 2023లో రైల్వే గ్రూప్–డి ట్రాక్ కీపర్(గ్యాంగ్‌మన్) ఉద్యోగం చేస్తూనే సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించానని చెబుతున్నాడు.. ఉపేందర్‌రెడ్డి.

తొలి ప్రయత్నంలోనే..


సందీప్‌రెడ్డి

నడిగూడెం : నడిగూడేనికి చెందిన బోళ్ల సీతారాంరెడ్డి, విజయలక్ష్మి దంపతులది రైతు కుటుంబం. వీరి కుమారుడు సందీప్ రెడ్డి బాసరలో ట్రిపుల్‌ఐటీ పూర్తి చేశాడు. కోచ్ పల్లపు నాగేశ్వరరావు వద్ద శిక్షణ తీసుకొని తొలి ప్రయత్నంలోనే ఎస్‌ఐ కొలువు సాధించాడు.

ఎస్‌ఐగా ఎంపికైన సతీష్


కన్నెబోయిన సతీష్

వేములపల్లి మండలం మొలకపట్నం గ్రామానికి చెందిన కన్నెబోయిన రమేష్ నాగమ్మ దంపతులది నిరుపేద కుటుంబం. వీరి కుమారుడు కన్నెబోయిన సతీష్ డిగ్రీ పూర్తి చేశాడు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుకున్న సతీష్ ఎస్‌ఐ కొలువు సాధించడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. సతీష్‌ను గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

కూలీ బిడ్డ ఎస్‌ఐగా ..


గణేష్

డిండి : డిండి మండల పరిధిలోని దాక్యాతండాకు చెందిన వడత్య హరిచంద్, నాజుల దంపతులకు 5గురు సంతానం. కూలీ పని చేస్తూ తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరి రెండవ కుమారుడైన గణేష్ తొలి ప్రయత్నంలోనే ఎస్‌ఐ ఉద్యోగం సాధించాడు. కూలీ బిడ్డగా పుట్టి కొలువు సాధించిన గణేష్‌ను తండావాసులు అభినందించారు.

ఒకే ఇంట్లో ముగ్గురికి ఉద్యోగాలు..


రాజశేఖర్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, గోవిందరెడ్డి

హుజూర్‌నగర్ : చింతలపాలేనికి చెందిన ఆదిలక్ష్మి, శ్రీనివాసరెడ్డిలది వ్యవసాయ కుటుంబం. వారికి ముగ్గురు కుమారులు . పెద్ద కుమారుడు రాజశేఖర్‌రెడ్డి 2016లో కానిస్టేబుల్‌గా, రెండవ కుమారుడు గోవిందరెడ్డి 2018లో ఆర్‌ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. మూడవ కుమారుడు విజయ భాస్కర్‌రెడ్డి ఎస్‌ఐ ఉద్యోగం సాధించాడు.

సుతారి మేస్త్రీ కుమార్తె ఎస్‌ఐగా..


తేజస్విని

వేములపల్లి : వేములపల్లి మండలం సల్కునూరు గ్రామానికి చెందిన అంకెపాక బాబు సుతారి మేస్త్రీ కాగా తల్లి రాణి వీఓఏగా పని చేస్తుంది. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంఎస్సీ మాథమెటిక్స్ చదువుతూనే సన్నద్ధమై ఎస్‌ఐ కొలువు సాధించింది. తేజస్వినిని తల్లిదండ్రులు, గ్రామస్తులు, బంధుమిత్రులు అభినందించారు.

పంచాయతీ కార్యదర్శి ఎస్‌ఐగా..


అజయ్ భార్గవ్

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన బాల్తు గురువయ్య–స్వరూపల కుమారుడు బాల్తూ అజయ్ భార్గవ్ మునగాల మండలం జగన్నాథపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నాడు. ఓ వైపు విధులు నిర్వహిస్తూనే మరో వైపు స్వతహాగా సన్నద్ధమై సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు.

'కొలువు'దీరిన పేదింటి బిడ్డ


మల్లికంటి శ్రీకాంత్

గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన మల్లికంటి వెంకట్రాములు(లేట్)–పద్మలది నిరుపేద కుటుంబం. వీరి కుమారుడు మల్లికంటి శ్రీకాంత్ ఉన్నత విద్య అభ్యసించి ఎస్‌ఐ కొలువుకు సన్నద్ధమై తొలి ప్రయత్నంలోనే విషయం సాధించాడు. సివిల్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించిన శ్రీకాంత్‌ను పలువురు అభినందించారు.

తొలి ప్రయత్నంలోనే..


మల్లికంటి మౌనిక

గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన మల్లికంటి శ్రీనివాస్–యశోధ దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి ముగ్గురు ఆడపిల్లలు సంతానం. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరి రెండో కుమార్తె మౌనిక ఎంఫార్మసీ చేస్తూ పోలీసు కొలువుకు సన్నద్ధమైంది. తొలి ప్రయత్నంలోనే సివిల్ ఎస్‌ఐగా ఎంపికైంది.

కానిస్టేబుల్‌గా చేస్తూనే..


సాగర్ల అనిత

చిట్యాల : మున్సిపాలిటీలోని వెంకటాపురాని చెందిన సాగర్ల అనిత 2013లో ఎంబీఏ పూర్తి చేసింది. 2018లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తోంది. లక్ష్యంతో చదివి ప్రస్తుతం సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యింది. ఆమెకు భర్త చిర్రబోయిన వెంకన్నతో పాటు ఇద్దరు పిల్లలున్నారు.

బీటెక్ విద్యార్థి ఎస్‌ఐగా ఎంపిక..


మేడి రాంమనోహర్

చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన రైల్వే ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న మేడి ఎల్లయ్య కొనేళ్లుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఇతని కుమారుడు రామ్‌మనోహర్ సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యారు. ఆతను 2018లో బీటెక్(ఈసీఈ)ను పూర్తి చేశాడు. ఇష్టంతో కష్టపడి చదవటంతో ఎస్‌ఐ ఉద్యోగాన్ని సాధించినట్లు రామ్‌మనోహర్ తెలిపారు.

నిరుపేద రైతు కుటుంబంలో జన్మించి..


వంగూరి మహేందర్

మునుగోడు: మునుగోడు మండలంలోని చొల్లేడు గ్రామ పంచాయతీ పరిధిలోని వంగూరిగూడెం గ్రామానికి చెందిన వంగూరి రాములు, లింగమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు మహేందర్ సంతానం. ఎంబీఏ పూర్తిచేసిన మహేందర్ 2018 లో ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ఆ ఉద్యోగం చేస్తూనే సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు.

ఫైర్‌మన్ సివిల్ ఎస్‌ఐగా..


కొంపల్లి సతీష్

నిడమనూరు: నిడమనూర్‌కు చెందిన కొంపల్లి సతీష్ మిర్యాలగూడ ఫైర్ స్టేషన్‌లో ఫైర్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. ఎస్‌ఎఫ్‌ఓ యాదగిరి ఆధ్వర్యంలో ఫైర్‌స్టేషన్‌లో సతీష్‌ను సత్కరించారు. తమ రెండో కుమారుడికి ఎస్‌ఐ ఉద్యోగం రావడం పట్ల తల్లిదండ్రులు అయోధ్య, సుగుణమ్మ సంతోషం వ్యక్తం చేశారు.

పట్టుదలతో ఎస్‌ఐగా..


బొంత ప్రవీణ్

గుండాల : గుండాల మండలం నూనెగూడెం గ్రామానికి చెందిన బొంత పాపయ్య, అండాలు చిన్న కుమారుడు బొంత ప్రవీణ్ డిగ్రీ పూర్తి చేశాడు. వీరిది పేద కుటుంబం. దిల్‌సుఖ్‌నగర్‌లోని ప్రైవేట్ ఇనిస్టిట్యూట్‌లో సన్నద్ధమై ఎస్‌ఐ ఉద్యోగాన్ని సాధించాడు. పట్టుదలతో ఎస్‌ఐగా ఎంపికై న ప్రవీణ్‌ను పలువురు గ్రామస్తులు అభినందించారు.

హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌ఐగా..


ఆలకుంట్ల నరేష్

గుండాల మండలం మాసాన్‌పల్లి గ్రామానికి ఆలకుంట్ల నర్సయ్య, నర్సమ్మల కుమారుడు ఆలకుంట్ల నరేష్ బీటెక్ పూర్తి చేశాడు. హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నరేష్ ఉన్నత ఉద్యోగానికి సన్నద్ధమయ్యాడు. ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగ ఫలితాల్లో ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. గ్రామాల ప్రజలు అతడికి అభినందనలు తెలిపారు.

ఎస్‌ఐగా ఎంపికైన రైతు బిడ్డ


తండ్రితో వీరబోయిన సైదులు

చివ్వెంల : చివ్వెంల మండల పరిధి లోని గుంజలూరు గ్రామానికి చెందిన వీరబోయిన వెంకన్న–మలింగమల్లమ్మల చిన్న కుమారుడు సైదులు 2020 లో ఫైర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి ఆలేరులో విధులు నిర్వహిస్తున్నాడు. అప్పటినుంచే ఎస్‌ఐ కావాలనే లక్ష్యంతో పట్టుదలతో కృషి చేసి కల నెవేర్చుకున్నాడు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..


చాడ సమత

మాడుగులపల్లి: మాడుగులపల్లి పంచాయతీ పరిధి గడ్డల దొరిగూడేనికి చాడ లింగారెడ్డి– స్వరూప దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె సమత పీజీ చదువుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమైంది. ఎస్‌ఐ పరీక్షలు రాసి తొలి ప్రయత్నంలోనే సివిల్ ఎస్‌ఐగా కొలువు సాధించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే విజయం సాధించగలిగానని ఆమె పేర్కొంది.

ఇష్టంతో చదివి..


మహేష్

కనగల్ : కనగల్ మండలం కుమ్మరిగూడేనికి చెందిన నీలకంఠం యాదయ్య, మంగమ్మల కుమారుడు మహేష్ పీజీ పూర్తి చేశాడు. ఇటీవల రైల్వేలో గ్రూప్–డి ఉద్యోగం సాధించాడు. నల్లగొండలో కిరాయి రూం తీసుకుని స్వశక్తితో కష్టపడి చదివి ఏఆర్ ఎస్‌గా ఎంపికయ్యాడు. ఇష్టంతో చదివి ఉద్యోగం సాధించినట్లు మహేష్ పేర్కొంటున్నాడు.

సివిల్ ఎస్‌ఐగా ప్రియాంక


ప్రియాంక

చిలుకూరు: చిలుకూరు మండలం పరిధిలోని జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన పందిరి అమృతరెడ్డి లక్ష్మి దంపతులది వ్యవసాయ కుటుంబం. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. వీరి రెండో కుమార్తె ప్రియాంక ఎంటెక్ పూర్తి చేసింది. ఈమె సోదరి తేజస్విని జైలు వార్డెన్‌గా పనిచేస్తుండగా తమ్ముడు శ్రీకాంత్‌రెడ్డి సివిల్ ఇంజనీర్ పూర్తి చేశాడు. ప్రియాంక పదో తరగతి వరకు జెర్రిపోతులగూడెంలో, ఇంటర్, ఇంజనీరింగ్ కోదాడలో, ఎంటెక్ హైదరాబాద్‌లో పూర్తి చేసింది. తొలి ప్రయత్నంలోనే ఎస్‌ఐగా ఉద్యోగం సాధించడం ఎంతో సంతోషంగా ఉందంటోంది.. ప్రియాంక. ఆమెను ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబుతో పాటు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

అటెండర్ కూతురు ఎస్‌ఐగా..


శాతం మౌనిక

ఆలేరురూరల్ : ఆలేరు మున్సిపాలిటీ 3వ వార్డు ఆదర్శనగర్‌కు చెందిన స్వామి, ఆండాలు దంపతులకు మౌనిక సంతానం. స్వామి ఆలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాంట్రాక్ట్ అటెండర్‌గా పని చేస్తున్నాడు. తల్లి టైలరింగ్ చేస్తోంది. ఎమ్మెస్సీ పూర్తి చేసిన మౌనిక ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తూనే సన్నద్ధమై తొలి ప్రయత్నంలోనే సివిల్ ఎస్‌ఐ కొలువు సాధించింది. పీఈటీ పూసలోజు కృష్ణచారి కొచింగ్‌తోనే ఈవెంట్స్‌లో రాణించానని, తండ్రి ఆశయాన్ని సాధించినందుకు సంతోషంగా ఉందంటోంది.. మౌనిక. ఆమెను పలువురు అభినందించారు.

డిప్యూటీ జైలర్‌గా..


పండ్ల నాగరాజు

గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామం గీత కార్మిక కుటుంబానికి చెందిన పండ్ల నాగరాజు డిప్యూటీ జైలర్‌గా ఎంపికయ్యాడు. నాగరాజు అన్న హైదరాబాద్‌లోని మహేశ్వరంలో ఫైర్ ఎస్‌ఐగా పని చేస్తున్నాడు. నాగరాజు తల్లి గ్రామంలో కారం మిల్లు నడుపుతోంది. డిప్యూటీ జైలర్‌గా ఎంపికై న నాగరాజును పలువురు అభినందించారు.

స్వతహాగా సన్నద్ధమై...


కంచుగట్ల లైల

అర్వపల్లి : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన కంచుగట్ల లింగయ్య–అంజమ్మల కుమార్తె లైల వివాహం కుంచమర్తి సర్పంచ్ ఉగ్గంపేంద్రలింగరాజు కుమారుడు కిశోర్‌తో 2020 డిసెంబర్‌లో జరిగింది. లైల ఎమ్మెస్సీ వరకు చదువుకుంది. ఇంటి వద్దే చదువుకొని రెండో ప్రయత్నంలో ఎస్సైగా ఎంపికైంది. కాగా ఆమె సోదరుడు కంచుగట్ల నరేష్ కూడా ప్రస్తుతం హైదరాబాద్‌లో టీఎస్ఎస్‌పీ ఎస్సైగా పనిచేస్తున్నారు.


తల్లిదండ్రులు లింగయ్య–అంజమ్మలకు మిఠాయి తినిపిస్తున్న కూతురు లైల

ఏఆర్ ఎస్‌ఐగా..


సుశాంత్

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన పుల్లూరి వెంకన్న శారద దంపతుల కుమారుడు సుశాంత్ తొలి ప్రయత్నంలోనే ఏఆర్ ఎస్‌ఐగా ఉద్యోగం సాధించాడు. డిగ్రీ పూర్తి చేసిన సుశాంత్ తండ్రి మాదిరిగా పోలీస్ శాఖలోనే ఉద్యోగం చేయాలని తపనతో హైదరాబాదులో కోచింగ్‌కు వెళ్లి కొలువు సాధించాడు.

చేనేత కళాకారులకు పురస్కారాలు


అవార్డు అందుకొంటున్న భోగ సరస్వతి, సాయిని భాస్కర్, దోర్నాల శేషగిరి



అవార్డులు అందుకుంటున్న చండూరు, గట్టుప్పల్ చేనేత కార్మికులు

భూదాన్‌పోచంపల్లి, చండూరు : చేనేతరంగంలో విశేష ప్రతిభ కనబర్చిన పోచంపల్లికి చెందిన ముగ్గురు చేనేత కళాకారులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర పురస్కారాలు అందుకున్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని మన్నెగూడెంలో బీఎస్‌ఆర్ పార్థ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో చేనేతలో నూతన డిజైన్లను రూపొందించిన సాయిని భాస్కర్, దోర్నాల శేషగిరి, 10వేల రంగుల షేడ్స్‌తో మధ్యన భారతదేశం పటం కల్గిన స్కార్ప్ తయారు చేసిన భోగ సరస్వతితో పాటు చండూరు, గట్టుప్పల్ మండలాలకు చెందిన కోట జానకీ రాములు, చిలుకూరి వీరేశం, చిలుకూరి కృష్ణ, మండల కిరణ్, కర్నాటి ప్రవీణ్‌కు రాష్ట్ర చేనేత జౌళిశాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వీరికి ప్రసంశాపత్రం, షీల్డ్‌తో పాటు రూ.25వేలు నగదు పురస్కారాలను అందజేశారు.

సంసార జీవితానికి అడ్డొస్తున్నాడని..

- బాలుడి గొంతు నులిమి చంపిన సవతి తల్లి
- నిందితురాలు అరెస్ట్

సూర్యాపేట రూరల్ : సంసార జీవితానికి అడ్డు వస్తున్నాడన్న నెపంతో ఓ మహిళ బాలుడిని గొంతు నులిచి హత్య చేసి ఆపై సాధారణ మరణంగా చిత్రీకరించేందుకు ప్లాన్ చేసింది. సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం ఫిర్యాదుతో సూర్యాపేట మండలంలోని మూడో విడత ఇందిరమ్మ కాలనీకి చెందిన మచ్చ మధు 2015లో కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల తర్వాత బాబు టైసన్ (06)జన్మించాడు. టైసన్‌కు రెండేళ్ల వయసున్న సమయంలోనే తండ్రి వదిలేసి వెళ్లిన తల్లి మరొకరిని వివాహం చేసుకుంది. దీంతో మధు తల్లి కళమ్మ దగ్గరే టైసన్ పెరుగున్నాడు. ఆరు నెలల క్రితం మోతె మండలం సర్వారం గ్రామానికి చెందిన బొడ్డు వాణి అలియాస్ రాణితో మధు ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. అప్పటినుంచి ఇద్దరు సహజీవనం చేస్తున్నారు.టైసన్‌ను సూర్యాపేట పట్టణంలోని సూర్యాపేట పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో విద్యనభ్యసిస్తున్నాడు.

అమ్మా.. కడుపులో నొప్పిగా ఉందన్నా..

టైసన్ రోజు మాదిరిగానే స్కూల్‌కు వెళ్లాడు. స్కూల్ నుంచి రాగానే సవతి తల్లికి అమ్మా బాగా కడుపులో నొప్పిగా ఉందని చెప్పాడు. వెంటనే గదిలోకి వెళ్లి మంచంపై నిద్రిస్తుండగా.. సవతి తల్లి టైసన్ గొంతు గట్టిగా నులిమి హతమార్చింది. వెంటనే టైసన్ తండ్రి మధుకు ఫోన్ ద్వారా టైసన్‌కు బాగా కడుపులో నొప్పిగా ఉందని.. రోదిస్తున్నాడంటూ తెలిపింది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు.

నాయనమ్మ ఫిర్యాదుతో..

టైసన్ నాయనమ్మ కళమ్మ మనువడి మృతిపై తనకు అనుమానం ఉందని ఈనెల 4న పోలీసులకు ఫిర్యాదు చేసింది. టైసన్ మృతదేహానికి జనరల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించగా.. నివేదికలో గొంతు నులిమి చంపినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. వెంటనే సవతి తల్లిపై అనుమానం వ్యక్తం కావడంతో ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించింది. దీంతో ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

చౌటుప్పల్ : కదులుతున్న బస్సులో నుంచి దూకి గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దంతెవాడ ప్రాంతానికి చెందిన సోమారు మబ్బి(47)మండల పరిధిలోని దండుమల్కాపురం శివారులోని ఓ పౌల్ట్రీఫాంలో పని చేస్తున్నాడు. ఈనెల 4న రాత్రి సమయంలో దండుమల్కాపురం వద్ద చౌటుప్పల్ వైపునకు వెళ్లే బస్సెక్కాడు. ఆ క్రమంలో ధర్మోజిగూడెం గ్రామం వద్ద కదులుతున్న బస్సులో నుంచి ఒక్కసారిగా దూకి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పురుగుల మందు తాగిన వ్యక్తి..

భువనగిరి : భువనగిరి మండలం రామకృష్ణాపురానినికి చెందిన ఎర్ర బాల్‌రెడ్డి(49) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గత నెల 7న ఛాతినొప్పి అధికం కావడంతో బాధ భరించలేక పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 6న మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.